క్లుప్తంగా

వేగంగా ఎన్‌సీడీసీడీ సర్వే



ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఎన్‌సీడీసీడీ(నాన్ కమ్యూనబుల్ డిసీజ్, కమ్యూనబుల్ డిసీజ్)పై ఆరోగ్య సిబ్బంది వేగవంతంగా సర్వే నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారులు శుక్రవారం తెలిపారు. సర్వేలో భాగంగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి బీపీ, షుగర్, క్యాన్సర్, క్షయ ఇతర వ్యాధులు గుర్తిస్తున్నారని, సంబంధిత వ్యక్తి వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు 3,675 మందిని సర్వే చేసినట్లు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ నగదు చెక్కులు పంపిణీ



తాడేపల్లిరూరల్ : పెదవడ్లపూడి గ్రామంలో అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతున్న వారికి ముఖ్య మంత్రి సహాయ నిధి నగదు చెక్కులను టీడీపీ నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన షేక్ శంషాద్‌కు రూ.1,30,920, ముప్పవరపు శివకుమారికి రూ.67,900, పందిపాటి రవికుమార్‌కు రూ.25,800 అందజేసినట్లు తెలిపారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారధి, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్ చంద్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్, పార్టీ గ్రామ అధ్యక్షుడు ఏళ్ల శివరామయ్య, మాదల రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి



తాడేపల్లిరూరల్ : ఉండవల్లిలో మంగళగిరి ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌లో శుక్రవారం లంక భూముల సమస్యలపై దళిత రైతులు వినతిపత్రాన్ని అందజేశారు. దళిత రైతుల పొలాలు కూడా సీఆర్‌డీఏ కింద వచ్చేవిధంగా ప్రయత్నం చేస్తామని, రాజధాని అసైన్‌మెంట్ భూముల రైతులకు వచ్చే ప్రయోజనాలను అమలు చేసేవిధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఉండవల్లి దళిత రైతులు తెలియజేశారు.

వసతి గృహానికి ఆర్వో ప్లాంటు వితరణ



తెనాలి: డాక్టర్ బాబాసాహెబ్ వర్ధంతి రోజున భారతీయ స్టేట్‌బ్యాంక్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సామాజిక సేవాకార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల వసతిగృహంలో చదువుతున్న విద్యార్థులకు బ్యాంక్ మేనేజ్‌మెంట్ సహకారంతో మంచినీళ్ల ఆర్‌ఓ, 50 కుర్చీలు, అయిదు బీరువాలు అందజేశారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.సునీల్ మేడికొండ మాట్లాడుతూ అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకుని ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచించారు. బ్యాంకు సహకారంతో అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు. ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ వీవీ జగదీష్‌కుమార్ మాట్లాడుతూ భారతీయ స్టేట్‌బ్యాంక్ ప్రజలకు ఆర్థిక సేవలనే కాకుండా సమాజ అవసరాలకోసం సహాయం చేస్తోందని తెలిపారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఐ.నిరీక్షణరావు, సంఘ కోశాధికారి డి.విజయ్, ఉపకార్యదర్శి టి.చందన, గుంటూరు జోన్ కార్యదర్శి కె.ప్రదీప్, వి.శ్రీనివాస నాయక్, హెచ్‌ఆర్ మేనేజరు తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి



రెవెన్యూ సదస్సులో ప్రసంగిస్తున్న కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లాలోని ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. శుక్రవారం వడ్డేశ్వరంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు ముఖ్య అతిథులుగా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ తేజ, సీసీఎల్ఏ అదనపు కమిషనర్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వ్యవసాయం, నివాసం, రెవెన్యూ సమస్యలు, నిషేధిత భూములు జాబితా, మ్యూటేషన్, అడంగల్, సర్వే, భూ రికార్డులలో సవరణలకు సంబంధించి అర్జీలను స్వీకరించి, పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. సదస్సులలో గ్రామానికి సంబంధించిన అన్ని భూ రికార్డులు ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ప్రజలు వాటిని తనిఖీ చేసుకుని రికార్డులలో సవరణలు ఉంటే అర్జీ దాఖలు చేస్తే, విచారించి అధికారులు పరిష్కరిస్తారని తెలిపారు. జిల్లాలోని 173 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జనవరి 8 వరకు జరుగుతాయని పేర్కొన్నారు. జేసీ భార్గవ తేజ మాట్లాడుతూ సదస్సులో వచ్చిన అర్జీలకు యూజర్ చార్జీలు రద్దు చేసినందున ఉచితంగా పరిష్కరించడం జరుగుతుందన్నారు. మురుగుడు హనుమంతరావు కాలనీ, రాధా రంగా నగర్‌లో 20 ఏళ్లుగా నివాసం ఉంటున్నామని, నివాస స్థలాల రిజిస్ట్రేషన్ పట్టాలు అందించాలని కలెక్టర్‌ను కోరారు. పూర్తి స్థాయిలో పరిశీలించి, నిబంధన ప్రకారం రెగ్యులైజేషన్‌కు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను, అధికారులను కలెక్టర్ ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల సమావేశ భవన నిర్మాణం కోసం గ్రామంలో ఖాళీగా వున్న ప్రభుత్వ భూముల వివరాలపై నివేదిక అందించాలన్నారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ జిల్లా మేనేజర్ లక్ష్మి కుమారి, సమగ్ర శిక్ష ఏపీడీ విజయలక్ష్మి, తాడేపల్లి తహసీల్దార్ డి. సీతారామయ్య, మండల సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కంతేరు(తాడికొండ): రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని, ఈ సదావకాశాన్ని ఉపయోగించుకొని సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలని తాడికొండ నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎం గంగరాజు అన్నారు. తాడికొండ మండలం కంతేరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మొత్తం 17 అర్జీలు రాగా ఇందులో ఇందులో 1 చెరువు ఆక్రమణ, 13 పాసుపుస్తకాలు, అడంగళ్ మిగిలినవి ఇతర సమ్యలపై అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కె.నాసరయ్య, ఇన్‌చార్జి సర్పంచ్ బి విజయరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న కమిషనర్ ఆలీం బాషా

మంగళగిరి: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని నగర పాలక సంస్థ కమిషనర్ ఆలీం బాషా అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. నగర పాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- అంబేడ్కర్ వర్ధంతిని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. సంఘం నాయకులు మన్యం శ్రీనివాసరావు, పారేపల్లి మహేష్, వరప్రసాద్, సాంబశివరావు పాల్గొన్నారు.
- పార్కు రోడ్డులో ఎస్సీ, ఎస్సీ యాక్ట్ రైట్స్ కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు కారుమంచి రామారావు, గరికముక్కు డేవిడ్, సుబ్బారావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్ : వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి నాయకత్వంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో క్రిస్టియన్ పేట వద్ద శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించారు. ప్రకాష్, దుర్గారావు, శ్రీనివాస మధు, ఉదయరాజు, గోపి, శ్రీను, వెంకటేశ్వరరావు, క్రిస్టియన్‌పేట యూత్ సంకూర్ అశోక్, విజయ్, నాగరాజు, గద్దం రామకోటయ్య, కృష్ణ, వినోద్, మనోజ్ పాల్గొన్నారు.

- టీడీపీ తాడేపల్లి పట్టణ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.
- కార్పొరేషన్ కార్యాలయంలోని అంబేడ్కర్ విగ్రహానికి సీపీఐ మంగళగిరి సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, తాడేపల్లి పట్టణ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య పూలమాలు వేసి నివాళులర్పించారు. సీనియర్ నేతలు మానికొండ డాంగే, బాషా, కాశిం, ప్రసాద్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

తాడికొండ: తాడికొండ ఎంపీడీవో కె సమతావాణి ఎంపీడీవో కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- తాడికొండ పోలీస్‌స్టేషన్ కూడలిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. జయ భారత్ కాలనీ నుంచి భారీ వాహన ర్యాలీ నిర్వహించారు. నిర్మాణ కమిటీ అధ్యక్షులు ఆనందరాజు, ఉపాధ్యక్షులు దూసరి డేవిడ్, గౌరవ అధ్యక్షులు తోకల నరసింహారావు, సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు, బెజ్జం రాజేష్, మిక్కిలి కిరణ్, మిక్కిలి ప్రేమ్ కుమార్, కర్రి సురేష్ పలువురు యువత భారీగా పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి ఈదులమూడి డేవిడ్ రాజు నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

మహనీయుడు అంబేడ్కర్



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు

మంగళగిరి: ఆత్మకూరులోని జాతీయ రహదారి వెంట ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ మంగళగిరి సమన్వయకర్త వేమారెడ్డి మాట్లాడుతూ..బలహీన వర్గాల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి ప్రత్యేక చట్టాలు రూపొందించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కొనియాడారు. చంద్రబాబు ప్రభుత్వం రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి ఎస్సీ, ఎస్టీ , బీసీ మైనార్టీలపై తప్పుడు కేసులు బనాయిస్తోందని విమర్శించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ అంబేడ్కర్ సమ సమాజం కోసం కృషి చేశారన్నారు. దేశమంతా రాజ్యాంగం అమలవుతున్నా.. ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వం నడవడం లేదని ఆరోపించారు. పార్టీ నాయకులు ఆకురాతి రాజేష్, సంకె సునీత, మల్లవరపు సుధారాణి, ఈపూరి ఆదామ్, వడ్డేశ్వరపు రజనీకాంత్, మాలిక్ బాబు, తాడిబోయిన సుబ్బారావు, సురేష్, ఆంజనేయులు, నాగయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.

కేఎల్‌యూలో ప్రపంచ నేలల దినోత్సవం



ప్రశంసా పత్రం అందజేస్తున్న డైరెక్టర్ డాక్టర్ రత్నప్రసాద్, విభాగాధిపతి డాక్టర్ బాలకృష్ణ

తాడేపల్లిరూరల్ : వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో ప్రపంచ నేలల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ విభాగం డైరెక్టర్ డాక్టర్ పి.రత్నప్రసాద్ మాట్లాడుతూ మానవ మనుగడతో పాటు జీవకోటికి నేల, నీరు ఎంతో అవసమరన్నారు. వ్యవసాయ విభాగాధిపతి డాక్టర్ బి.బాలకృష్ణ మాట్లాడుతూ ఆహార కొరత లేకుండా అందరికీ ఆహారాన్ని అందించే బాధ్యత వ్యవసాయ విభాగంపై ఉందన్నారు. వ్యవసాయ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ప్రపంచంలో ఎక్కడకు వెళ్లినా ఉద్యోగం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం వ్యవసాయ విభాగ విద్యార్థులు వక్తృత్వ పోటీలు నిర్వహించి, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగ ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

ఫిరంగిపురం: గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జె.ప్రసాదరావు అన్నారు. వేములూరిపాడులో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు భూ సమస్యలపై ప్రజల నుండి 43 అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. వాటిని పరిశీలించి ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. దేవాదాయ శాఖ ఈవో జె.శ్రీనివాసరావు, రిజిస్ట్రేషన్ శాఖ సీనియర్ అసిస్టెంట్ షేక్.మస్తాన్‌షరీఫ్, సర్వేయర్ జి.వెంకటేశ్వర్లు, ఆర్ఐ షేక్.అబ్దుల్ రెహమాన్, వీఆర్వోలు కె.రామాంజి, నర్మద పాల్గొన్నారు.

నెహ్రూ నికేతన్ కాలేజీ క్రీడాపోటీలు

తెనాలి: స్థానిక బోసురోడ్డులోని నెహ్రూ నికేతన్ జూనియర్ కళాశాలలో శుక్రవారం సాయంత్రం అంతర కళాశాల క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ దాసరి ఈ పోటీలను ప్రారంభించారు. నాలుగురోజులు జరిగే పోటీల్లో తొలిరోజున బాలురకు వాలీబాల్, బాలికలకు 'సెలెక్ట్ ది కోంచ్' ఆటలను జరిపారు. చదువు, మార్కులతోపాటు మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం కోసం కాలేజీలో ఏటా క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. బాల్యంనుండే క్రీడల్లో ఆసక్తిని కల్పించి, ఆసక్తి కలిగిన క్రీడల్లో శిక్షణనిస్తే మంచి ఫలితాలను సాధిస్తారని చెప్పారు. కాలేజీ ప్రిన్సిపాల్ వి.శేషగిరిరావు, వైస్‌ప్రిన్సిపాల్ పీఎస్ శంకర్ పర్యవేక్షించారు.

రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు పటిష్ట చర్యలు



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్

తాడికొండ: రాజధాని నిర్మాణం కోసం తమ భూములను ఏపీ సీఆర్డీఏకు ఇచ్చిన రైతులకు ఈ లాటరీ ద్వారా అందించిన ప్లాట్ల రిజిస్ట్రేషన్లను అధికారులు త్వరితగతిన పూర్తి చేయాలని సీఆర్డీఏ అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం తుళ్ళూరులోని ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డేలో రాజధాని రైతులు పాల్గొని, వారి సమస్యలను విన్నవించి అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలు విన్న కమిషనర్ కొన్ని సమస్యలకు వెంటనే పరిష్కారం చూపించగా మిగిలినవి వెంటనే పరిష్కరించాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు చేసేందుకు తహసీల్దారు, ఉప తహసీల్దారు, సబ్ రిజిస్ట్రార్, ఇతర అధికారులు అందుబాటులో ఉండి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. గ్రీవెన్స్‌లో మొత్తం 50 సమస్యలపై అర్జీలు రాగా ఇందులో భూ వ్యవహారాలు- 45, సామాజిక అభివృది- 1, అమరావతి స్మార్ట్ సిటీ-1, ఇన్‌ఫ్రా-1, భూముల సర్వే-2 సమస్యలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ గ్రీవెన్స్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె స్వర్ణమేరీ, బి సాయి శ్రీనివాస్ నాయక్, జి భీమారావు, జి రవీందర్, ఎజి చిన్ని కృష్ణ, పి పద్మావతి, కెఎస్ భాగ్యరేఖ, డి హుస్సేన్ సాహెబ్, ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ జిపి రామకృష్ణన్, డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు, పలువురు తహసీల్దార్‌లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

తెనాలిఅర్బన్: తెనాలి డబుల్ హార్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లెప్రో సొసైటీ సహకారంతో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న 10 మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున శుక్రవారం పాత ప్రభుత్వ వైద్యశాలలో అందజేశారు. ఈ సందర్భంగా లెప్రో సొసైటీ కో ఆర్డినేటర్ రాధిక మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తుల సంక్షేమానికి డబుల్ హార్స్ ఫౌండేషన్ కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ డి.రమాదేవి, ఫైలేరియా ఎస్‌హెచ్ఐ రవికుమార్, లెప్రో సొసైటీ ప్రతినిధులు ఏవీ భాషా, రమణయ్య పాల్గొన్నారు.

మందుల దహనంపై విచారణ

తెనాలిఅర్బన్: తెనాలి సుల్తానాబాద్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో జరిగిన మందుల దహనంపై డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ శుక్రవారం విచారణ జరిపారు. అర్బన్ హెల్త్ సెంటర్‌కు వెళ్లి దహనం చేసిన మందుల వివరాలు నమోదు చేసుకున్నారు. కాలపరిమితి ముగిసిన తక్కువ మోతాదులోని మందులను బయో వేస్ట్ సిబ్బందికి అందజేయకుండా వాటిని సిబ్బంది దహనం చేసినట్లు విచారణలో తేలినట్లు చెప్పారు. ఫార్మసిస్ట్‌కు మెమో ఇచ్చినట్లు తెలిపారు. ప్రథమ తప్పుగా భావించి చర్యలు తీసుకోకుండా వదిలేసినట్లు తెలిపారు. మరోసారి ఇలా జరగకుండా చూసుకోవాలని హెచ్చరించినట్లు పేర్కొన్నారు.

కాడి తగిలి వృద్ధుడి మృతి

ల్లభాపురం(కొల్లిపర): ఎడ్ల బండి కాడి తగిలి, బండి టైరు క్రింద పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి వల్లభాపురంలో చోటు చేసుకుంది. దీనిపై స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం వల్లభాపురం గ్రామంలో యాదవపాలెంలో బమాధవరావు (70) అనే ఒంటరి వృద్ధుడు జీవిస్తున్నాడు. ఇతను ఇంటి వద్ద నుంచి గ్రామంలో ప్రధాన కూడలికి వెళుతున్న సమయంలో పక్కనే వెడుతున్న ఎద్దులబండి బెదరడంతో కాడి తగిలి బండి టైరు క్రిందపడ్డాడు. స్థానికులు గమనించి వెంటనే 108 ద్వారా తెనాలి వైద్య శాలకు తరలించారు. అయితే మార్గ మధ్యంలో అతను మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గతంలో భార్య అనారోగ్యంతో మృతి చెందగా అప్పటి నుండి ఒంటరిగా జీవిస్తున్నాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు పెళ్లి చేసుకొని రామచంద్రపాలెంలో కూలి పనులు చేసుకుంటూ అక్కడ జీవిస్తున్నాడు. కుమార్తెలకు కూడా పెళ్లి అయ్యింది. మృతుడు మాధవరావు సొంత గ్రామం హనుమాన్‌పాలెం అక్కడి నుంచి భార్య సొంత గ్రామైన వల్లభాపురం వచ్చి గత కొని ఏళ్లుగా ఉంటున్నాడు.

అనారోగ్యంతో..

తెనాలిరూరల్: స్థానిక మున్సిపల్ మార్కెట్ ఎదుట వృద్ధుడి అనార్యోంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుడిని కొల్లిపర మండలం అన్నవరం గౌడ కాలనీకి చెందిన జన్ను సాంబశివరావు (65)గా గుర్తించారు. మార్కెట్ ఎదుట ఉన్న గాంధీ విగ్రహం వద్ద మృతి చెంది పడి ఉన్నాడు. మృతదేహాన్ని బంధువులకు బంధువులకు అప్పగించారు. అనారోగ్య సమస్యలతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు.

న్యాయవాదుల నిరసన

తెనాలిరూరల్: తెనాలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టం సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ న్యాయవాదులకి ఇబ్బందులు గురిచేసేలా ఉందని దానిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ తీసుకొచ్చిన న్యాయవాదుల హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ లోపబూయిష్టంగా ఉందని ఇతర రాష్ట్రాల కంటే భిన్నంగా ఎక్కువ మొత్తాన్ని పాలసీ రూపంలో న్యాయవాదుల నుంచి వసూలు చేసేదిగా ఉందన్నారు. ఈ రెండు చట్టాల్ని వెంటనే రద్దు చేయాలని విధులు బహిష్కరించినట్టు తెలిపారు. ఈ చట్టాలను వెనుక్కు తీసుకోకపోతే భవిష్యత్తులో మరిన్ని రోజులపాటు ఉద్యమాన్ని తీవ్రతరం చేసి నిరాహార దీక్షలకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి హరిదాస్ గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్త పరీక్షలు నిర్వహిస్తున్న బ్లడ్ బ్యాంక్ సిబ్బంది

మేడికొండూరు: రక్తదానం ప్రాణ దానంతో సమానమని, రక్తదానం చేయడం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ఎన్నారై విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.తిలక్ బాబు అన్నారు. మేడికొండూరు సమీపంలోని ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం రక్తదానం ప్రాముఖ్యత, బ్లడ్ గ్రూపుల ప్రభావాలపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి గుంటూరుకు చెందిన శ్రీ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కోట శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి బ్లడ్ గ్రూపింగ్ నిర్వహిస్తూ, రేర్ గ్రూప్లో ఉన్న వాళ్ళు రక్తదానం చేస్తూ, తమ గ్రూపుల జాగ్రత్త వహించాలని రక్తదానం వలన అనేకమందికి ప్రయోజనాలతో పాటు తమకు కూడా ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుందని తెలిపారు. గత నెలలో సుమారు వంద యూనిట్ల బ్లడ్ బ్యాంక్ వారికి రక్తదానం ద్వారా అందజేశామన్నారు. మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వెయ్యి మందికి బ్లడ్ గ్రూప్ నిర్వహించడం జరిగిందన్నారు. బోధన, బోధనేతర సిబ్బందికి షుగర్, బీపీలు, శ్రీ బ్లడ్ బ్యాంక్ ఉచితంగా చెక్ చేసి ఆరోగ్య సలహాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, కళాశాల ఏవో సీతారామయ్య, పలువురు అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తెనాలి ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

- విరిగిన బోన్‌కు కండను తొడిగి శస్త్ర చికిత్స
- వెంటనే శస్త్ర చికిత్స చేయటంతో తొలగిన ప్రమాదం



రోగి కాలుకు ప్లాస్టిక్ సర్జరీ చేస్తున్న దృశ్యం

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలోని ఆర్థోపెడిక్ వైద్యులు అరుదైన శస్త్ర చికిత్సను చేశారు. విరిగిన ఎముకకు అతికొద్ది గంటలలోనే ప్లాస్టిక్ సర్జరీ చేసి రోగి నడిచేందుకు వీలు కల్పించారు. వైద్యులు కథనం ప్రకారం... కొల్లూరు మండలం రావికంపాడుకు చెందిన ప్రేమ్‌కుమార్(24) ద్విచక్రవాహనంపై గురువారం రాత్రి 10 గంటల సమయంలో వస్తు రోడ్డు ప్రమాదానికి గురి అయ్యాడు. కుడికాలు మోకాలు వద్ద వెముక విరిగిపోయి కండంత చిద్రమైంది. వెంటనే అతడు జిల్లా వైద్యశాలకు చికిత్స నిమిత్తం రావటంతో సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ జే హనుమంతరావు అతడికి పరీక్షలు చేశారు. 8 నుంచి 12 గంటలలోపు ప్లాస్టిక్ సర్జరీ చేయకపోతే ఎముక చచ్చుపడే అవకాశం ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఆరోగ్యశ్రీ కింద నమోదు చేయించి శుక్రవారం ఉదయం ప్లాస్టిక్ సర్జరీ చేశారు. విరిగిన ఎముకకు రాడ్లు వేయటంతో పాటు ప్రక్కన ఉన్న కండను దానిపై వేసి చర్మానికి కుట్లు వేశారు. సాధారణంగా ఇలాంటి కేసులకు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో శస్త్ర చికిత్సలు చేస్తుంటారు. కానీ తెనాలి జిల్లా వైద్యశాలలోని సీనియర్ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ జే హనుమంతరావు, డాక్టర్ వెంకటేశ్వరరావు, ఎనస్తీషియా వైద్యులు డాక్టర్ శ్రీకృష్ణ, డాక్టర్ మజీదా బేగంలు రోగికి ప్లాస్టిక్ సర్జరీ చేసి ప్రాణాపాయం తప్పించారు. వీరికి వైద్యశాల అధికారులు అభినందనలు తెలిపారు. అలాగే రోగి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.